ప్రజాశక్తి
శుక్రవారం 29 సెప్టెంబర్ 2023 5 అనంతపురం



1న 'స్వచ్ఛత హి సేవ' : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అక్టోబర్ 1వ తేదీన ఉదయం 10 గంటలకు స్వచ్ఛత హి సేవలో భాగంగా ఏక్ దిన్ ఏక్ గంట కార్యక్రమం కింద శ్రమదానం చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరు ప్రభుత్వ ఉద్యోగులు, స్వయం సహాయక బందాలు, ఎన్‌సిసి సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, గ్రామీణ యువత, యూత్ క్లబ్బులు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని శ్రమదానం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని ముఖ్యమైన ప్రదేశాల నుంచి చెత్తను తొలగించాలన్నారు. అక్టోబర్ ఒకటో తేదీన చేపట్టే శ్రమ దానం కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలన్నారు. ఈ నెల 30వ తేదీన శానిటేషన్ వర్కర్లకు, క్లాప్ మిత్రాలకు ప్రత్యేకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మెడికల్ క్యాంపులు నిర్వహించి స్పెషలిస్ట్ డాక్టర్లతో మెడికల్ చెకప్ చేయించాలని డిపిఒకు కలెక్టర్ సూచించారు.

బిక్కు,బిక్కుమంటూ,,!

- ◆ హెచ్‌ఎల్‌ఎంసిపై స్ట్రక్చర్స్ బలహీనం
- ◆ ఎప్పుడు కుప్పకూలుతాయోనన్న గుబులు



మూడు రోజుల క్రితం బొమ్మనహాల్ మండలం దర్గాహొన్నూరు హెచ్‌ఎల్సీపై కూలిన ఐరన్ బ్రిడ్జి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువపై పోవాలంటేనే బిక్కుబిక్కునే పరిస్థితి నెలకొంది. కాలువపైనున్న నిర్మాణాలు కుప్పకూలుతాయోనని గుబులుతో స్థానికులు భయపడిపోతున్నారు. ఏటా ఇవి పడిపోతుండటమే ఇందుకు కారణం. గతేడాది రెండు చోట్ల బ్రిడ్జిలు పడిపోయాయి. ఈసారి ఒక బ్రిడ్జి కుప్పకూలింది. ఉన్న మరిన్ని బ్రిడ్జిల పరిస్థితి అదే విధంగా ఉంది.

30 ఏళ్ల క్రితం నాటి పరిస్థితి

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ బొమ్మనహాల్, కణేకల్, విడపనకల్లు మండలాల్లో ఉంటుంది. సుమారు 84 కిలోమీటర్ల మేర ఉంది. ఈ పరిధిలో సుమారు 13 వరకు బ్రిడ్జిలున్నాయి. ఇందులో బొమ్మనహాల్ మండలం పరిధిలోనే తొమ్మిది బ్రిడ్జిలున్నాయి. వీటిని కాలువ నిర్మాణ సమయంలో 30 సంవత్సరాల క్రితం నిర్మించినవి. రైతులు పొలాలకు వెళ్లాలంటే కూడా ఇదే ప్రధానంగా ఉన్నాయి. ఇవి లేకపోతే ఆ గ్రామాల పరిధిలో పొలాలకు వెళ్లటం సాధ్యం కాదు. ఈ బ్రిడ్జిలు దాదాపుగా అన్నీ బలహీనపడ్డాయి. ఈ నిర్మాణాలు ఎప్పుడు కూలిపోతాయో అన్నట్టుగా ఉన్నాయి. గతేడాది రెండు బ్రిడ్జిలు కూలిపోయాయి. ఒక బ్రిడ్జి అయితే బొలేరో వాహనంలో కూలీలతో పొలానికెళుతున్న సమయంలో కుప్పకూలింది. అయితే మధ్యలో అది ఆగిపోవడంతో బతికిబయటపడ్డారు. ఈ ఏడాది మంగళవారం నాడు కూడా ఒక వంతెన పడిపోయింది. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తక్కిన బ్రిడ్జిలు ఎప్పుడు కూలుతాయోనన్నట్టుగానే ఉన్నాయి. ఇందులో రెండు బ్రిడ్జిలయితే నిరంతరాయంగా ఆర్టీసీ బస్సులు కూడా నడుస్తున్నాయి. బొమ్మనహాల్, గేలిగేర్ గ్రామాల వద్ద ఈ నిర్మాణాలు బలహీనపడి ఉన్నాయి. బస్సు వెలుతున్న సమయంలో ఏదైనా జరిగితే పెద్ద ప్రమాదమే జరిగే అవకాశముంది.

పదేపదే పడుతున్న గండ్లు

గట్ల పరిస్థితి ఇదే తీరుగా ఉండటం గమనార్హం. 2007లో ప్రారంభమైన ఆధునీకరణ పనులు ఇప్పటికీ పూర్తవలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పనులను పూర్తిగా రద్దు చేసింది. కనీసం మరమ్మతులు కూడా ఉండటం లేదు. దీంతో ఎప్పుడు ఎక్కడ తెగిపోతాయోనన్న గుబులు నెలకొంది. ఈ ఏడాదే రెండు పర్యాయాలు గట్లు తెగిపోయాయి. ఏటా ఇదే పరిస్థితి నెలకొంది. పూర్తి స్థాయి నీటిని కూడా తీసుకోలేకపోయే పరిస్థితి నెలకొంది.

రూ.33.74 కోట్లతో ప్రతిపాదనలు పంపాం

ప్రధాన కాలువ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. రూ.33.74 కోట్లు ప్రతిపాదనలు పంపించాం. ఇందులో స్ట్రక్చర్సు, బ్రిడ్జిలు కొన్నిచోట్ల బలహీనపడ్డాయి. వీటి మరమ్మత్తుల కోసం ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులొచ్చాక వాటిని చేపట్టడం జరుగుతుంది.

రాజశేఖర్,
ఎస్ఇ, హెచ్‌ఎల్‌సి.

చేతికందని పంట..!

- ◆ అదునులో కాని పదును
- ◆ సాగు చేసిన అరకొర పంటపైనా వర్షాభావ ప్రభావం
- ◆ ఖరీఫ్ సాగుతో రైతుకు నష్టం



రాయదుర్గం మండలం కొంతానపల్లి వద్ద వాడిపోయిన వేరుశనగ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

వరుణుడిపై ఆధారపడి, భూమిని నమ్ముకుని వ్యవసాయం ద్వారా పంట పండిస్తామని కోటి ఆశలతో ఎదురు చూసే రైతులకు ఈ ఖరీఫ్ కూడా తీరని నష్టాన్నే మిగిల్చింది. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది లోటు వర్షపాతంతో వ్యవసాయ రంగం కుదేలైంది. పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక రైతులు మరింత ఇబ్బందుల్లో పడ్డారు. అదునులో వర్షాలు రాక, సాగు చేసిన అరకొర పంటలు కూడా మండుతున్న ఎండలకు వాడిపోతున్నాయి. రాయదుర్గం డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు గాను వేరుశనగ సాధారణ విస్తీర్ణం 41,884 హెక్టార్లు కాగా ఈ ఏడాది 34,727 హెక్టార్లు సాగు అయినట్లు తెలుస్తోంది. సుమారు 7157 హెక్టార్ల మేర వేరుశనగ సాగు తగ్గింది. ఖరీఫ్ సీజన్లో జూన్ 15 నుంచి జూలై 30వ తేదీ వరకు మాత్రమే వేరుశనగ సాగు చేసేందుకు అనువైన సమయంగా ఉంటుంది. వర్షభావ పరిస్థితుల దష్ట్యా ప్రత్యామ్నాయంగా తక్కువ పెట్టుబడితో, 90 రోజుల్లో చేతికందే ఆముదం, పత్తి, కంది, కొర్రలు లాంటి పంటలను రైతులు సాగు చేశారు. గుమ్మగట్టలో 12,006 హెక్టార్లు వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం కాగా 11,686 హెక్టార్లలో సాగు అయ్యింది. రాయదుర్గం మండలంలో 14,596 హెక్టార్లు కుగాను 11786 హెక్టార్లు, డి హీరేహాల్ 5877 హెక్టార్లకు గాను 5106 హెక్టార్లు, కనేకల్ 7448 హెక్టార్లకు గాను 4759 హెక్టార్లు, బొమ్మనహాల్‌లో 1957 హెక్టార్లకు గాను1390 హెక్టార్లలో సాగు జరిగింది. జూన్, జులై నెలలో కాస్త వర్షాలు పడ్డప్పటికీ ఆగస్టు, సెప్టెంబర్ మాసాలు వచ్చేపాటికి లోటు వర్షపాతం నమోదు అయ్యింది. దీంతో వేరుశనగ సాగు పూర్తిగా తగ్గింది. సాగు చేసిన అరకొర పంట కూడా ఎండదశకు చేరుకుంది. పంట చేతికందని పరిస్థితుల్లో కనీసం పశువులకు మేత అయినా సమకూర్చుకోలేని దైన్యస్థితిలో రైతాంగం ఉంది. ఇప్పటికే ప్రతిపక్ష, వామపక్ష పార్టీలు రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల దష్ట్యా రాబోవు రోజుల్లో అన్ని రంగాల వ్యాపారాలపై ప్రతికూల ప్రభావం పడనుందని వ్యాపార వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకునే చర్యలను చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

రైతుకు కన్నీటి కష్టం

- ◆ 8ఎకరాల్లో వేరుశనగ పంటతొలగింపు
- ◆ వర్షం లేక ఎండిపోయిన చెట్లు

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లాలో వర్షాభావం రైతు కంట కన్నీరు తెప్పిస్తోంది. వేరుశనగ పంట సాగు చేసి రెండు నెలలు గడుస్తున్నా సకాలంలో వర్షాలు రాకపోవడంతో పంట చేతికి అందని పరిస్థితి తెలిసింది. దీంతో రైతులు పంటను అర్ధాంతరంగానే తొలగించేస్తున్నారు. ఇలాంటి ఘటనే విడపనకల్లు మండలం చీకలగురికి గ్రామంలో చోటు చేసుకుంది. చీకలగురికి గ్రామానికి చెందిన మహిళా రైతు పార్వతమ్మ తనకున్న ఎనిమిది ఎకరాల భూమిలో వేరుశనగ పంట సాగు చేసింది. సకాలంలో వర్షాలు రాక పంట మొత్తం ఎండిపోయింది. పంట చేతికందదన్న ఉద్దేశంతో గురువారం నాడు ట్రాక్టర్‌తో 8 ఎకరాలనూ ట్రాక్టర్‌తో దున్నేసింది. దాదాపు నాలుగు లక్షలు పంట కోసం ఖర్చు చేశానని, ఇందంతా నష్టపోయాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పశువులకైన మేత దొరుకుతుందన్న ఉద్దేశంతో పంటను తొలగించానని చెప్పారు.



చీకలగురికిలో తొలగించిన వేరుశనగ పంట

స్వామినాథన్ మృతి సమాజానికి తీరనిలోటు

ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో నివాళి



స్వామినాథన్‌కు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, తదితరులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వ్యవసాయ శాస్త్రవేత్త, రైతు సంక్షేమ సిఫార్సు ప్రధాత ఎంఎస్.స్వామినాథన్ మృతి సమాజానికి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్ గురువారం అస్తమించారు. ఆయన మృతికి సంతాపం తెలుపుతూ ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్, మానవ హక్కుల వేదిక ఎస్ఎం.బాషా, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, ప్రముఖ సామాజికవేత్త బోసు, పాత్రికేయులు నాగరాజు, సిఐటియు రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ హాజరై విశ్వనాథన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్ ఇక లేరన్న విషయం అందరినీ కలిచివేసే అంశం అన్నారు. ఆహారవద్ధిలో భారత్ స్వయం సమద్ధి సాధించేందుకు విశేష కషి చేశారని తెలిపారు. అధిక దిగుబడినిచ్చే వరి రకాలను అభివద్ధి చేయడంలో స్వామినాథన్ కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఇది భారతదేశంలోని తక్కువ ఆదాయం గల రైతులు ఎక్కువ దిగుబడిని ఉత్పత్తి చేయడానికి సహాయ పడిందన్నారు. స్వామినాథన్ 1987లో చెన్నైలో ఎంఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించారని తెలిపారు. దానిద్వారా ఆయన మొదటి ప్రపంచ ఆహార బహుమతిని అందుకున్నారని తెలిపారు. స్వామినాథన్ అనేక అవార్డులను అందుకున్నారని గుర్తు చేశారు. 1971లో రామన్ మెగసెసే అవార్డు, 1986లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వరల్డ్ సైన్స్ అవార్డు అందుకున్నారని తెలిపారు. వ్యవసాయ రంగానికి స్వామినాథన్ అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని కొనియాడారు. ప్రతి రైతు సంక్షేమంలోనూ స్వామినాథన్ జీవించి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ వీరభద్రయ్య, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు సాకే హరి, సోమర రాహుల్, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్, జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, ఆవాజ్ జిల్లా నాయకులు వలీ, సిపిఎం జిల్లా నాయకులు రామిరెడ్డి, ప్రకాష్, రైతు కూలి సంఘం జిల్లా నాయకులు నాగరాజు, రైతు సంఘం జిల్లా నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకిచ్చిన మాట నిలుపుకోవాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల ముందు, తరువాత ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నిలుపుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్సు అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. అనంతపురం నగరంలోని వికె.మెమోరియల్ హాలులో గురువారం నాడు మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ ప్రాంతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఈయనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తాము అధికారంలోకి వస్తూనే రెగ్యులరైజేషన్ చేస్తామని ప్రతిపక్షంలో ఉండగా వైఎస్.జగన్మోహన్ రెడ్డి అనంతపురం జిల్లాలోనే హామీనిచ్చారని గుర్తు చేశారు. ఆ తరువాత అసెంబ్లీలోనూ ఆయన ఇదే విషయాన్ని ప్రకటించారని తెలిపారు. సమాన పనికి సమాన వేతనమిస్తామని కూడా హామీనిచ్చారన్నారు. కాని ఇప్పటి వరకు ఆ హామీని నెరవర్చే దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 వేల మంది కార్మికులు మున్సిపాలిటీల్లో పనిచేస్తున్నారన్నారు. వీరిలో అత్యధికులు ప్రమాదభరిత పరిస్థితులు పనిచేస్తున్నారన్నారు. వారికి ఉద్యోగ భద్రతగానీ, సరైన వేతనంగానీ లభించడం లేదని అన్నారు. 20 సంవత్సరాలకుగాపైనా పనిచేస్తున్న వారికి కూడా వేతనాలు నామమాత్రంగానే ఉన్నాయన్నారు. అప్కాస్ విధానాన్ని తీసుకొచ్చి ఉద్యోగులుగా గుర్తిస్తామని చెప్పడమే మినహా ఒరిగిందేమి లేదని అన్నారు. సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుయటీ, ఎన్‌కాష్‌మెంట్ లీవ్, పింఛను తదితరం లేవన్నారు. ఉద్యోగుల పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందటం లేదని చెప్పారు. ఇలా అన్ని రకాలుగా కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగు ఉద్యోగులిచ్చిన హామీని అమలు చేయమని అడుగుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి తన హామీని నిలుపుకోలేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు సైతం దిగుతామని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనమిస్తామని హామీనిచ్చిందన్నారు. సర్టిఫికెట్లు లేవన్న పేరుతో స్కిల్డ్‌కు కూడా సెమీస్కిల్డ్ పేరుతో జీతం తక్కువ ఇస్తున్నారన్నారు. రూ.15 వేలకు మించి జీతాలివ్వడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధిచెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, ఎపి మున్సిపల్ వర్కర్సు అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా నాయకులు ఎటిఎం నాగరాజు, ఇంజినీరింగు విభాగం నాయకులు పాల్గొన్నారు.

29న కంబదూరులో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



కలెక్టర్ ఎం.గౌతమి

ఈనెల 29వ తేదీన కంబదూరులో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. కంబదూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు ఇందులో పాల్గొంటారన్నారు. కంబదూరు మండల ప్రజలు ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మిలాదున్‌నబీ పండుగను పురష్కరించుకుని జమాతే ఇస్లామీ హింద్, ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం నాడు అనంతపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ అరవిందకుమార్ హాజరై వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ నగర అధ్యక్షుడు నవాజ్ అహమ్మద్, కార్యదర్శి హాజీపీరా, యూత్ మూవ్‌మెంట్ నగర అధ్యక్షులు ఫిరోజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు అఖిలపర్వీన్ పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రతి పల్లెకూ 'మిలియన్ హార్ట్'

లార్డ్ హాస్పిటల్ వైద్యులు అనిల్

ప్రజాశక్తి-తాడిపత్రి



పల్లె ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అనిల్

10 లక్షల మంది గుండెలు కాపాడగలనే నమ్మకంతో 'మిలీనియం హార్ట్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు లార్డ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అనిల్ పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతంలో జన్మించి లండన్‌లో షుగర్ వ్యాధిపై పరిశోధనల బందంలో సభ్యుడిగా ఈయన అనేక పరిశోధనలు చేశారు. పుట్టిన ప్రాంతానికి తనవంతు సేవలు అదించాలనే ఉద్దేశంతో తాడిపత్రిలో లార్డ్ ఆసుపత్రిని ప్రారంభించి షుగర్, బిపి, కొలెస్ట్రా జబ్బుల బారిన పడకుండా షుగర్ లేని సమాజం స్థాపించడం కోసం రూపాయికే వైద్య సేవలు అందిస్తున్నారు. రూపాయి డాక్టరుగా పిలవబడే డాక్టర్ చామల వెంకట అనిల్ కుమార్ రెడ్డి మిలీనియం హార్ట్ పేరుతో మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మిలియన్ హార్ట్ కార్యక్రమంపై ప్రజాశక్తితో డాక్టర్ అనిల్ తన లక్ష్యాన్ని, కార్యక్రమం ఉద్దేశాన్ని తెలియజేశారు. షుగరు, బిపి, కొలెస్ట్రాల్ మానవునికి గుండె జబ్బు, పక్షవాతం, కిడ్నీ జబ్బులకు ప్రధాన కారకాలని అన్నారు. మూడింటిని నియంత్రించుకుంటే గుండె జబ్బులు రాకుండా ఆపవచ్చునని తెలిపారు. ప్రస్తుతం నడి వయసులో 40 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయస్కులు గుండె జబ్బుతో అర్ధ ఆయుషుతో మరణిస్తున్నారని అన్నారు. ఇలాంటి చావులను ఆపగలిగిన పరిజ్ఞానం, పరిశోధనలు అందుబాటులో ఉన్నాయన్నారు. తాడిపత్రిలోని లార్డ్ హాస్పిటల్ ద్వారా మిలియన్ హార్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికీ మొబైల్ ల్యాబ్ వెళ్తుందని చెప్పారు. క్యాంపు ఏర్పాటు చేసిన గ్రామంలోనే బిపి, షుగరు, కిడ్నీ, కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.ల్యాబ్ పరీక్షలకు డాక్టర్ ఫీజు దాదాపు 1000 రూపాయలు అయినప్పటికీ ఒక రూపాయితో తాము వీటిని నిర్వహిస్తామన్నారు. ఇప్పటివరకు రెండు నెలల కాలంలో 41 గ్రామాలు పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడంలో మా వంతు బాధ్యతగా లార్డ్ ఆసుపత్రి ద్వారా సొంత ఖర్చులతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఒక్క చావును ఆపగలిగినా, ఒక్క గుండె జబ్బు రాకుండా ఆపగలిగినా తన శ్రమ, ఖర్చుకు సార్థకత చేకూరునట్లేనని డాక్టర్ అనిల్ తెలిపారు.

జిపిఎస్ పేరుతో మోసం

ఓపిఎస్ అమలు చేసేంత వరకు పోరాడుతాం
యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి. కోటేశ్వరప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



జిపిఎస్ ప్రతులను దహనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ పేరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులను దారుణంగా మోసం చేస్తోందని యుటిఎఫ్ నాయకులు తెలిపారు. పాత పెన్షన్(ఓపిఎస్)ను అమలు చేయాలని, జిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నిరసన చేపట్టారు. టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద జిపిఎస్ బిల్లు ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.లింగమయ్య, గోవిందరాజులు, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్ర హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన జిపిఎస్ బిల్లును యుటిఎఫ్ వ్యతిరేకిస్తోందన్నారు. సిపిఎస్ రద్దు చేస్తామని నమ్మించిన ముఖ్యమంత్రి జిపిఎస్ అంటూ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయులు పోరాటం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఏకపక్షంగా జిపిఎస్ బిల్లును ఆమోదించడం దుర్మార్గంగా ఉందన్నారు. ఇది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చీకటి రోజుగా భావిస్తున్నట్లు తెలిపారు. వెంటనే జిపిఎస్ బిల్లును రద్దు చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షురాలు సరళ, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.నాగేంద్ర, మండల బాధ్యులు వెంకట నాయుడు, ప్రవీణ్, రాజు కుళ్లాయప్ప, బసవరాజు, బాషా పాల్గొన్నారు.

జాషువా సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రముఖ రచయిత, కవి, సాహితీకారుడు, నవయుగ చక్రవర్తి గుర్రం జాషువా సేవలు ఎనలేనివని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. గురువారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాషువా జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాషువాకు చిన్నతనం నుంచే సజనాత్మక శక్తి ఉండేదన్నారు. బొమ్మలు గీయడం, పాటలు పాడడం చేసేవాడిని చెప్పారు. ఆయన 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు రాశారని తెలిపారు. కవితా విశారద, కవికోకిల, నవయుగ చక్రవర్తి, విశ్వకవి సామ్రాట్‌గా బిరుదులు పొందారన్నారు. తెలుగు రాష్ట్రంలో జన్మించిన అతి గొప్ప వ్యక్తుల్లో జాషువా ఒకరన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర్ రెడ్డి, ఐఅండ్‌పిఆర్ డిఐపిఆర్ఒ గురుస్వామి శెట్టి, కలెక్టరేట్ ఏవో శ్రీధర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ పుణ్యవతి, కలెక్టరేట్ ఐ అండ్ పిఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

1న ఆదియోధుడు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- అనంతపురం కల్టెరేట్

స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన డాక్టర్ విఆర్.రాసాని రాసిన "ఆదియోధుడు" పుస్తకాన్ని అక్టోబర్ 1వ తేదీన ఆవిష్కరిస్తున్నట్లు స్పందన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారామ్, చంద్రశేఖర్ శాస్త్రీ గురువారం తెలిపారు. పుస్తక పరిచయ సభ స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుతున్నట్లు తెలిపారు. కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్



జిల్లా కోర్టు ఆవరణలో శుభ్రం చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, మున్సిపల్ సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ప్రతి కుటుంబం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అత్యంత ముఖ్యమని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి.శ్రీనివాస్ సూచించారు. నగరంలోని జిల్లా కోర్టు ఆవరణంలో గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కోర్టు పరిసరాలను పరిశుభ్రం చేశారు. జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అపరిశుభ్రత అనేది అనేక వ్యాధులకు కారణమవుతుందన్నారు. మంచి పరిసరాలు మంచి ఆలోచనలు కలిగిస్తాయని, మానసి క, శారీరక, దృఢమైన సమాజాన్ని ఏర్పాటు చేయడం పరిశుభ్రమైన పరిసరాల ద్వారా సాధ్యమవుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్, ఉప కమిషనర్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుల సహాయ సహకారాలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు, కోర్టు సిబ్బందిని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, మున్సిపల్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిపిఎస్ జిఒ ప్రతులు దగ్ధం



జిపిఎస్ జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

జిపిఎస్ వద్దు ఒపిఎస్‌ను అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్ప చౌదరి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిపిఎస్ జిఒ ప్రతులను దగ్ధం చేశారు. యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ జిపిఎస్‌ను ఉపసంహరించుకొని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే విధంగా భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సంజీవ్‌కుమార్, ఉరవకొండ జోన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, ఉమాపతి, శ్రీధర్, రఘు, శ్రీనివాస్‌గుప్తా, సంజప్ప, కార్యవర్గ సభ్యులు నాగరాజు, రాజశేఖర్, బండయ్య, మధుబాబు, రవి, శివ, రామచంద్ర, ఎర్రిస్వామి, రమేష్ పాల్గొన్నారు.



గుత్తి, గుంతకల్లులో భగత్‌సింగ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెవివి, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ నాయకులు

విప్లవవీరుడు భగత్ సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి-గుత్తి

విప్లవీరుడు భగత్ సింగ్ జయంతిని గురువారం పట్టణంలో జన విజ్ఞాన వేదిక, భగత్‌సింగ్, బోస్ యూత్ కమిటీ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని సత్రం మిట్ట సమీపంలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న, జిల్లా అధ్యక్షులు పి.వెంకటరామిరెడ్డి, భగత్‌సింగ్ బోస్ కమిటీ నాయకుడు నిజాముద్దీన్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలను నెరవేర్చే విధంగా యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జెవివి నాయకులు జె.కుళ్లాయిబాబు, దేశాయి నాగరాజు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు అహోబిలేసు, కోట గైడ్ రమేష్, భగత్ సింగ్ బోస్ యూత్ కమిటీ నాయకులు రమేష్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. ఎపి రాష్ట్ర పెన్షనర్ల భవనంలో భగత్‌సింగ్ గుర్రం జాషువా జయంతి సభలు నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి కుళ్లాయిబాబు, కోశాధికారి ఫకృద్దీన్, నాయకులు కృష్ణవేణి, విజయలక్ష్మి, దుర్గమ్మ, షేక్షావలి, నారాయణరెడ్డి, నరసింహులు, మద్దిలేటి, నారాయణశెట్టి, లోకనాథ్‌రెడ్డి, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : పట్టణంలో గురువారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవకారుడు భగత్ సింగ్ జయంతి సభ నిర్వహించారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండు వద్ద ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సురేంద్ర, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మద్దికెర ప్రతాప్, దాసరి చరణ్‌కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ నేటి సమాజంలో యువత భగత్ సింగ్ భావజాలంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చొక్కా సునీల్‌కుమార్, సహాయ కార్యదర్శి శ్రీనాథ్, యశ్వంత్, ప్రసాద్, నితిన్, మురళి, విక్రమ్, పునీత్, హర్ష, హనీఫ్, పాల్గొన్నారు.

టిడిపికి భవిష్యత్తు లేదు : ప్రభుత్వ విప్ కాపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపికి భవిష్యత్తు లేదు, నిజాయితీ పరులు, నిస్వార్థంగా సేవ చేయాలని ఉన్న వాళ్లు ఆ పార్టీని వీడి వైసిపిలోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్ని ఆధారాలతోనే చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. ఫైబర్ నెట్, రింగ్‌రోడ్ అలైన్‌మెంట్ మార్పు కేసులో చంద్రబాబు ప్రమేయం ఉన్నట్లు తెలిపారు. బాబును కాపాడాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం శూన్యం అన్నారు. చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. శేష జీవితం కోర్టులు, కేసులు, న్యాయవాదుల చుట్టూ తిరగడానికి సరిపోతుందన్నారు. త్వరలో లోకేష్‌పై కూడా కేసులు నమోదవుతాయన్నారు. కాలవ శ్రీనివాసులు కూడా దొంగేనని, ఎలా పడితే అలా మాట్లాడకుండా నోరు భద్రం పెట్టుకోవాలని హితవు పలికారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, పట్టణ కన్వీనర్ శీవప్ప, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు భోజరాజు నాయక్, ఎంపిపి విద్యావతి, జడ్పిటిసి సభ్యులు మల్లికార్జున, మహేష్, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు వలిబాషా, శ్రీనివాస్‌యాదవ్, మండల కన్వీనర్లు గౌని కాంతారెడ్డి, వన్నూరుస్వామి, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



లఘు చిత్రం షూటింగ్‌ను ప్రారంభిస్తున్న గిరిజమ్మ, 'ఊరి కోసం పుట్టాడు' చిత్ర నటులు


'అనంత'లో సినిమా షూటింగ్

అనంతపురం : నగరంలోని సప్తగిరి సర్కిల్ సమీపంలోని గీతామందిరంలో ఎన్.ఎస్.ఎం.వర్మ దర్శకత్వంలో రమేష్, బ్రాహ్మ నిర్మాణ సారథ్యంలో రూపొందిస్తున్న 'ఎనీ పర్సన్ ప్రొటెక్టర్' అనే లఘు చిత్రాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ గురువారం కెమెరా స్విచ్ ఆన్ చేసి లాంఛనంగా ప్రారంభించా రు. గిరిజమ్మ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఉన్న ఒక అంశాన్ని తీసుకుని దాన్ని లఘుచిత్ర రూపంలో ప్రజల ముందుకు తీసుకురావడం సంతోషమని తెలిపారు.

'ఊరి కోసం పుట్టాడు' నూతన సినిమా నటులకు శిక్షణ

'ఊరి కోసం పుట్టాడు' అనే నూతన చిత్రం ప్రీ ప్రొడక్షన్‌లో భాగంగా నటీనటులకు గురువారం నగరంలోని విద్యుత్ నగర్ రెండవ క్రాస్‌లో ఉన్న అనంతపురం ఫిల్మ్ సొసైటీ ప్రివ్యూ థియేటర్‌లో శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు, నిర్మాత రషీద్‌బాషా, అనంతపురం ఫిల్మ్ సొసైటీ గౌరవాధ్యక్షులు కంబదురి షేక్ నబిరసూల్, మూవీ డైరెక్టర్ సాయి అరవింద్, నటీనటులు మహిమ, బిల్లే బాలకృష్ణ, నాగరాజు, షబ్బీర్, ఫర్దిన్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు వైసిపి మండల కన్వీనర్‌గా పూజారి లక్ష్మీ నరసింహులు



ఆత్మకూరు మండల కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు

ఆత్మకూరు : రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్లను నియమించింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. చెన్నేకొత్తపల్లి మండల కన్వీనర్‌గా గంగిరెడ్డి గారి నర్సిరెడ్డి, రామగిరికి కర్రా హనుమంతరెడ్డి, కనగానపల్లికి మామిళ్లపల్లి అమర్‌నాథ్‌రెడ్డి, రాప్తాడుకి జూటూరు శేఖర్, అనంతపురం రూరల్ మండలానికి కదిరబ్బ రాధమ్మ, ఆత్మకూరు మండల కన్వీనర్ గా పూజారి లక్ష్మీ నరసింహులును నియమించారు.



ఐద్వా ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టిన సభ్యులు

మహిళా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి-గుంతకల్లు

చట్టసభల్లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని పట్టణ ఐద్వా నాయకురాళ్లు డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని కోరుతూ గురు వారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ఐద్యా పట్టణ అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో మహిళలతో సంతకాల సేకరణ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలకు రక్షణ కరువైందన్నారు. తొమ్మిదేళ్లుగా మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు పాస్ చేయలేకపోయారని ప్రశ్నించారు. మహిళా బిల్లు కేవలం పేపర్లకే పరిమితం చేయరాదన్నారు. మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బిల్లు వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో ఐద్వా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు గౌతమి, సుగుణ, రాణి, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.



పెన్నహోబిలం వద్ద ఐరన్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎంపి తలారి రంగయ్య, జెసి కేతన్ గార్గ్

పెన్నహోబిలం ఐరన్ బ్రిడ్జి పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని పెన్నహోబిలం వద్ద ఉన్న ఐరన్ బ్రిడ్జిని గురువారం ఎంపి తలారి రంగయ్య, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ పరిశీలించారు. పెన్నహోబిలం వద్ద ఉన్న వందేళ్ల నాటి ఐరన్ బ్రిడ్జి వృథాగా ఉండడంతో తుంగభద్ర హై లెవెల్ కెనాల్ మీద పడిపోయిన బ్రిడ్జిల స్థానంలో వంతెనల నిర్మాణం కోసం ఈ ఐరన్‌ను మళ్లీ ఉపయోగించుకునేందుకు పనికి వస్తుందా లేదా అని పరిశీలించాలని అధికారులకు ఎంపి, జెసి సూచించారు. వారితో పాటు హెచ్ఎల్‌సి ఎస్ఇ రాజశేఖర్, ఎన్‌హెచ్ ఎస్ఇ, ఇఇ మధుసూదన్, తహశీల్దార్ హరిప్రసాద్, తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని

పుట్లూరు : జిల్లా స్థాయి అండర్–19 ఖోఖో, టెన్నికాయిట్ పోటీల్లో స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థిని వై.ఎస్తేర్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అస్మాసాయేదా తెలిపారు. ఎస్తేర్‌ను ప్రిన్సిపల్, పిడి పవన్‌కుమార్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నగరంలో రెండ్రోజులు తాగునీటి సరఫరా నిలిపివేత


అనంతపురం కార్పొరేషన్ : అమృత్ పథకం కింద కొత్తగా నిర్మించిన 16 ఎం.ఎల్.డి సామర్థ్యం ఉన్న ఫిల్టరేషన్ ప్లాంట్‌కు ఇంటర్ కనెక్షన్స్ ఇవ్వటానికి వీలుగా నగరంలో రెండు రోజులు(శని, ఆదివారం) తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగమోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో వానరానికి అంతిమ సంస్కారాలు

అనంతపురం : నగరంలోని రామ్‌నగర్ పార్కులో బుధవారం రాత్రి ఓ వానరం కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. స్థానికులు ఈ విషయాన్ని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయికుమార్‌కు ఫోన్ ద్వారా తెలిపారు. దీంతో అక్కడికి చేరుకున్న సాయి ట్రస్ట్ బృందం ఆ వానరానికి పూజలు నిర్వహించి శాస్త్రోక్తం గా అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌చౌదరి, ట్రస్ట్ సభ్యులు నారాయణ నాయక్, ధనుష్, తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి జడ్పిటిసి పరామర్శ

తాడిపత్రి రూరల్ : ఈ నెల 16వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఈశ్వర్‌ను గురువారం తాడిపత్రి జడ్పిటిసి కురుబ రమణమ్మ పరామర్శించారు. అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన ఈశ్వర్‌ను జడ్పిటిసితో పాటు వైసిపి నాయకులు రామ్‌శేఖర్, కౌన్సిలర్ రంగనాథ్‌రెడ్డి, ఉమ్మడి గురుప్రసాద్‌రెడ్డి, కురుబ శివరామయ్య, భాస్కర్ అతడి ఇంటికి వెళ్లి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. రూ. 10వేలు అందజేసి అండగా ఉంటామని, అధైర్య పడొద్దని భరోసా కల్పించారు.



ఈశ్వర్‌కు ఆర్థిక సాయం చేస్తున్న జడ్పిటిసి రమణమ్మ



రాయదుర్గం దీక్షలో పాల్గొన్న కాలవ శ్రీనివాసులు, తెలుగుతమ్ముళ్లు, ఉరవకొండలో రిలే దీక్షలో పాల్గొన్న టిడిపి గౌడ కులం సంఘం, టిడిపి నాయకులు

జాప్యం జరిగినా న్యాయం గెలుపు తథ్యం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం :

చంద్రబాబు రాష్ట్రంలో మళ్లీ పాలనా పగ్గాలు చేపట్టి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. టిడిపి పాలనలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం పొందిన వాల్మీకి, బోయలు చంద్రబాబుకి అండగా ఉంటారని పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ వాల్మీకి/బోయలు పట్టణంలోని టిడిపి కార్యాలయం నుంచి బళ్లారి రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం దాకా ర్యాలీ నిర్వహించారు. కాలవ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దీక్ష శిబిరంలో మా ట్లాడారు. ఒక్కరోజు పిలుపుతో వందలాదిగా వాల్మీకులు తరలిరావడం రాయదుర్గంలో టిడిపి భవిష్యత్ విజయానికి సంకేతమన్నారు. బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు పదవులను కాపాడుకోవడం కోసం జగన్‌కు భజన పరులుగా మారారన్నారు. న్యాయస్థానాల్లో న్యాయం జాప్యం కావొచ్చేమే గానీ, ధర్మం గెలవడం తథ్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి/బోయ సాధికార కన్వీనర్ పూల నాగరాజు, డైరెక్టర్ సుదర్శన్, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు తిప్పయ్య, మండల కన్వీనర్ లాలెప్ప, సన్నన్న, మారుతి, అంజి, జగదీష్, నాగార్జున, ఎంపిటిసి గంగాధర్, సర్పంచి నాగరాజు, రమేష్, తిప్పేస్వామి, సంజీవ, క్రిష్ట, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఓడిపోతుందని తెలిసే సిఎం జగన్ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయించారని టిడిపి గౌడ కులం సంఘం నాయకులు పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఈడిగ సామాజిక వర్గం ప్రజలు స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి రిలే నిరాహార దీక్ష శిబిరం వరకూ నల్ల జెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. దీక్షలో సంఘం నాయకులు జగదీష్, వేణు, గోపాల్, విశ్వనాథ్, కృష్ణ, కూడేరు మండలానికి చెందిన నాయకులు విజయ్ భాస్కర్ గౌడ్, బుర్ర ఎర్రి స్వామి, కుమార్, కుళ్లాయప్ప, టి.ఎర్రిస్వామి, శకుంతలమ్మ, జయప్ప, పరంధామ, బెళుగుప్ప మండల నాయకులు నాగభూషణం, శివ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల నాయకులు పాల్గొని చంద్రబాబుకు మద్దతు తెలిపారు.

శింగనమల : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండల పరిధిలోని పెరవలి గ్రామంలో జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు గోరంట్ల మారుతి నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి చంద్రబాబుపై జరుగుతున్న కుట్రలు, కుతంత్రాలను ప్రజలకు వివరించారు. వారు మాట్లాడుతూ 2024లో టిడిపి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచి రాజు, మట్లగొంది సర్పంచి గాండ్ల రమేష్, వార్డ్ మెంబర్ బాలకృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, మాసుల చంద్రమోహన్, దండు విజయ్ కుమార్, పెరవలి కృష్ణమోహన్ నాయుడు, నాగరాజు వీరాంజ నేయులు, వెంకటస్వామి, కృష్ణమోహన్, రామచంద్రారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రంగస్వామి, బిసి సెల్ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి పెద్దన్న, నియోజవర్గ బిసి సెల్ కార్యదర్శి నారాయణస్వామి, మొండిపోగుల ఎర్రిస్వామి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు వీరనారాయణ, చిక్కాల చెనరాయుడు, రాచేపల్లి రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జలదీక్ష

తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీరంగరాయలు చెరువు లో జల దీక్ష చేపట్టారు. దండు శ్రీనివాసులు మాట్లాడుతూ ఉమ్మడి ఎపిలో చిరకాలం గుర్తుండిపోయేలా హైటెక్ సిటీ, నదుల అనుసంధానం, పోలవరం ప్రాజెక్టు, తదితర అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందిన ఏకైక తెలుగు వారి నాయకుడు చంద్రబాబు అన్నారు. అలాంటి నాయకుడిని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటేష్, బెస్త కృష్ణమూర్తి, బెస్త శంకర్, బెస్త లక్ష్మయ్య, బెస్త ఓబిలేసు, బెస్త ప్రసాద్, బెస్త మల్లి, దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి ఆదినారాయణ, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బండి పరుశురాం, నాయి బ్రాహ్మణ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటప్ప, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, బెస్త సాధికార సంఘం జిల్లా అధ్యక్షులు అమర్నాథ్, సిపిఐ నాయకులు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నప్పయాదవ్, వెంకట్ రెడ్డి, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పప్పుశనగ విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో రబీ సీజన్‌లో నల్లరేగడి నేలల్లో సాగు చేసేందుకు పప్పుశనగ విత్తనాలను 40శాతం రాయితీతో పంపిణీ చేసేందుకు జిల్లాకు 27,266 క్వింటాళ్లు కేటాయించారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ గురువారం తెలిపారు. జిల్లాలో 21 మండలాల్లో పప్పుశనగ పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 40 శాతం సబ్సిడీపై ఒక రైతుకు గరిష్ఠంగా 200 కిలోల వరకూ పంపిణీ చేస్తామన్నారు. ఒక ఎకరానికి (20 కిలోల పరిమాణం) రెండు బస్తాలు, గరిష్ఠంగా 10 బస్తాలు ఐదెకరాల వరకూ సబ్సిడీపై పప్పుశనగ విత్తనాలు ఇస్తామన్నారు. క్వింటాల్ పూర్తి ధర రూ. 8,100 కాగా సబ్సిడీ రూ. 3,240 పోనూ రూ. 4,860 రైతు వాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే నల్లరేగడి నేలలు ఉన్న మండలాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించామని, అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆలమూరు రహదారిలో గుంతలు పూడ్చివేత



ఆలమూరు రోడ్డులో మరమ్మతులు చేపట్టిన దృశ్యం

ప్రజాశక్తి సిటీ : నగర శివారులోని రుద్రంపేట గ్రామ పంచాయితీ నుంచి ఆలమూరుకు వెళ్లే రహదారి గుంతలమయం కావడంతో వాహనదా రులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణనాయక్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు సర్పంచి మట్టి తోలించి పెట్రోల్ బంకు నుంచి చర్చి వరకూ గుంతలు పూడ్చి తాత్కాలికంగా పరిష్కారం చూపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ అక్కులప్ప, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సర్వమతాల సారాంశం ఒక్కటే

మిలాద్ ఉన్ నబి వేడుకల్లో మేయర్ వసీం



అనంతపురం మిలాద్ ఉన్ నబి వేడుకల్లో పాల్గొన్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సర్వమతాల సారాంశం ఒకటేనని నగర మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. 'మిలాద్ ఉన్ నబి' పర్వదినం పురస్కరించుకుని గురువారం నగరంలోని అశోక్ నగర్, సాయి నగర్‌లో మేయర్ నేతృత్వంలో ముస్లింలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. మేయర్ మాట్లాడుతూ సర్వోన్నత మహనీయుడు మహమ్మద్ ప్రవక్త అని, అల్లాహ్ సూచించిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. మిలాద్ ఉన్ నబి పర్వదినాన సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా మారిందని, ఇదే సంస్కృతిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీం, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : మిలాద్ ఉన్ నబి సందర్భంగా మురాదాబాద్ నుండి 'ముఫ్తీ నయీముద్దీన్ రజ్వీ' ముఖ్యఅతిథిగా హాజరై ప్రవక్త గురించి ప్రసంగించారు. పట్టణంలోని గౌసే ఆజం మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో భారీగా ఊరేగింపు నిర్వహించారు. ఇందులో ప్రవక్త గొప్పతనాన్ని చాటుతూ గేయాలు ఆలపించారు. బళ్లారి రోడ్ లోని దర్గా మస్జిద్ నుంచి బయల్దేరి ఆత్మకూరు వీధి, ఊరు వాకిలి, వినాయక సర్కిల్, లక్ష్మీబజార్, కణేకల్లు రోడ్డు, ఓబుళాచారి రోడ్డు మీదుగా తిరిగి మస్జీదుకు చేరుకున్నారు. ఊరేగింపులో ముస్లింలతో పాటు గౌని ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉరవకొండ : మహ్మద్ ప్రవక్త బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని వైసిపి యువజన విభాగం జోనల్ ఛైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి తెలిపారు. 'మిలాద్ ఉన్ నబి' వేడుకలకు ప్రణయ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పవిత్ర జెండాను పూలమాలలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు తఖిబాబా, షాకిబ్ సాహెబ్, తాసిర్ సాహెబ్ యువనేతను పూలమాలలతో సత్కరించారు. అనంతరం ముస్లింలతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల, పట్టణ అధ్యక్షులు ఎసి ఎర్రిస్వామి, సమన్వయకర్త ఓబన్న, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీరంబాషా, ఉరవకొండ, విడపనకల్లు కో ఆప్షన్ సభ్యులు పామిడి సలీమ్, లతీఫ్, ఎంపిటిసి హొన్నూరు సాబ్, జెసిఎస్ కన్వీనర్ ఆసిఫ్, పామిడి జాకిర్, మొమిన్ జిలాన్, వడ్ల సలీమ్, అయ్యర్ సాధిక్, యూసుఫ్, దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా, జిఎంఎస్ షాకిర్, జెండా జిలాన్, అయ్యర్ దాదు, ఖాదర్, ముల్లా జిలాన్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు : జామియా మసీద్ ముతవల్లి దివాన్ పీర్ ముర్షద్ పీర్ ఆధ్వర్యంలో దిగువ వీధి మదీనా మజీద్ నుంచి దివాన్ పీర్ దర్గా, బస్టాండ్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. మత గురువు ముర్షద్ పీర్ మాట్లాడుతూ ప్రతి ముస్లిం సన్మార్గంలోనే నడవాలని సూచించారు. కార్యక్రమంలో నేమ్ తుల్లా ఖాద్రి షేక్ ఫకృద్దీన్, జామియా మదీనా ముతవల్లి టైలర్ మహబూబ్ పీరా, శర్మాస్, ఖాదర్ వలి పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల పరిధిలోని ఉద్దేహాల్, బొమ్మనహాల్, శ్రీధర్‌ఘట్ట, గోనెహాల్, ఏలంజి, గోవిందవాడ, కళ్లహోల, తారకాపురం, చంద్రగిరి, నేమకలు, దర్గాహొన్నూరు, తదితర గ్రామాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బొమ్మనహాల్ ముతవల్లి నూర్‌మహమ్మద్, ఉద్దేహాల్ బాబాఫకృద్దీన్, గోనెహాల్ డాక్టర్ బాషా, ఏలంజి బాషా, మత పెద్దలు పాల్గొన్నారు.

గుత్తి : మండల వ్యాప్తంగా ముస్లింలు మిలాద్ ఉన్ నబి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. గుత్తి ఆర్ఎస్‌లోని పెద్ద జామియా మసీదు వద్ద కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా, కమిటీ నాయకులు పాల్గొన్నారు.



కణేకల్లులో మిలాద్ ఉన్ నబి వేడుకల్లో మాట్లాడుతున్న ముతవల్లి, బొమ్మనహాల్‌లో ర్యాలీ చేపట్టిన ముస్లింలు

బాలాపురంలో చోరీ

పుట్లూరు : మండల పరిధిలోని బాలాపురం గ్రామంలో రూ. 52వేలు నగదు చోరీ అయినట్లు బాధితురాలు ప్రభావతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ ఇంటికి తాళం వేసి తాడిపత్రిలో ఉన్న కొడుకుల దగ్గరికి వెళ్లానని, తిరిగి ఆదివారం రాత్రి ఇంటికి చేరుకోగా తాళం తీసి ఉండగా తానే తాళం వేయడం మరచి పోయానని అనుకున్నానని, బీరువా కూడా యథావిధిగా ఉండడంతో చోరీ జరిగినట్లు అనుమానం రాలేదని, బుధవారం పుట్లూరులో చోరీ జరిగిన విషయం చుట్టుపక్కల వారు చెప్పడంతో బీరువా తెరిచి చూడగా అందులో భద్రపరచిన రూ. 52వేలు కనిపించలేదని వాపోయింది. వెంటనే పోలీసులకు విషయం తెలుపగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంఎస్ స్వామినాథన్‌కు నివాళి

తాడిపత్రి : ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతి రైతాంగం, వ్యవసాయ రంగానికి తీరని లోటని ఎపి రైతు సంఘం తాడిపత్రి మండల కమిటీ నాయకులు సూర్య నారాయణరెడ్డి, రాజారాంరెడ్డి పేర్కొన్నారు. 60వ దశకంలో దేశం ఆహార సంక్షోభం ఎదుర్కొంటున్న సమయంలో హరిత విప్లవం తీసుకొచ్చి ఆహార స్వయం పోషక ఉత్పవానికి నాంది పలికిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ అన్నారు. అనేక రంగాల్లో ముఖ్యమైన సేవలు అందించారన్నారు. స్వామినాథన్ మృతికి సంతాపం తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

దోమల నివారణకు ఫాగింగ్

పుట్లూరు : వాతావరణంలో మార్పుల వల్ల దోమల తీవ్రత పెరిగి వైరల్ జ్వరాలు ప్రబలుతున్నందున ముం దు జాగ్రత్త చర్యగా పంచాయతీ మొత్తం గురువారం ఫాగింగ్(దోమల పొగ) చేశారు. ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని పంచాయతీ కార్యదర్శి సరోజ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి రామిగాళ్ల ఓబులేసు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.